క్లుప్తంగా

పాలిథిన్ విక్రయాలపై దాడులు



పాలకొండ రోడ్డులోని ఓ బేకరీ షాపులో తనిఖీలు చేస్తున్న శానిటరీ కార్యదర్శులు

రాజాం సిటీ: పట్టణంలో నిషేధిత పాలిథిన్, ప్లాస్టిక్ విక్రయాలపై ముమ్మరంగా దాడులు నిర్వహిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు తెలిపారు. మంగళవారం రాజాం–పాలకొండ రోడ్డులోని హోటళ్లు, బేకరీలు, వివిధ దుకాణాల్లో తనిఖీలు చేపట్టి, పలు పాలిథిన్ కవర్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. మరోసారి పాలిథిన్ కవర్లతో పట్టుబడితే భారీగా జరిమానా విధించడంతో పాటు దుకాణం కూడా సీజ్ చేస్తామని హెచ్చరించామన్నారు. ప్రతిరోజూ ఏదో ఒక సమయంలో దాడులు చేస్తామన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజం నిర్మాణానికి అందరూ గుడ్డసంచులు వాడాలని కోరారు.

'వలంటీర్లకు వందనం'



వలంటీర్లను సత్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు

బొబ్బిలి: స్థానిక సచివాలయం–10లో వలంటీర్లకు వందనం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందించిన వలంటీర్లను సేవామిత్ర, సేవారత్న పురస్కారాలతో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ సీహెచ్ మురళి సత్కరించారు. ముందుందు కూడా ఇలానే బాగా పనిచేసి, ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని వారు కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ మేనేజర్ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ రామకృష్ణ

మెంటాడ: తహసీల్దార్‌గా ఆర్.రామకృష్ణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల సహాయ, సహకారాలతో ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు



రేగిడి ఆమదాలవలసలో సుబ్రహ్మణ్యస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

రేగిడి: మండలంలోని ఆమదాలవలస, రేగిడి, గోపెంపేట, అంబకండి, సంకిలి గ్రామాల్లోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమదాలవలస ఆలయ పూజారి కిన్నెరకాంతం అన్నారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల భక్తులు కూడా పాల్గొన్నారు.

జేవీకే స్టాక్ పాయింట్ పరిశీలన



సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్ఎస్ఏ సీఎంఓ ఆదినారాయణ

వంగర: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జేవీకే(జగనన్న విద్యాకానుక) కిట్ల స్టాక్ పాయింట్‌ను ఎస్ఎస్ఏ సీఎంఓ వి.ఆదినారాయణ మంగళవారం పరిశీలించారు. సకాలంలో ప్రభుత్వ పాఠశాలలకు జేవీకే కిట్లు పంపిణీ చేయాలని సిబ్బందికి సూచించారు. పాఠశాలల పునఃప్రారంభం రోజునే విద్యార్థులకు వీటిని అందజేసేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ వై.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల కోసం పేర్లు నమోదు చేసుకోండి



వన్నలి గ్రామంలో విత్తనాల కోసం పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న రైతులు

రేగిడి: ఖరీఫ్ సాగుకు సంబంధించి, విత్తనాలు కావాల్సిన వారు తమ పేర్లు నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. అన్ని గ్రామాల రైతు భరోసా కేంద్రాల వద్ద అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయాధికారి డి.మురళీకృష్ణ తెలిపారు. పేర్లు నమోదు చేసుకున్న వారికి విత్తనాలు ఇచ్చేటప్పుడు తొలి ప్రాధాన్యం ఇస్తామన్నారు.

పేదల అభ్యున్నతే సీఎం జగన్ ధ్యేయం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కంబాల జోగులు



ఇంటింటికీ వెళ్లి, సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

సంతకవిటి: పేదల అభ్యున్నతే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని మందరాడ గ్రామంలో మంగళవారం పర్యటించిన ఆయనకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలని కోరారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో జై జోగులు అన్న.. జై జగనన్న అని గ్రామస్తులు నినాదాలు చేశారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమన్నారు. అన్ని వర్గాలకు అన్ని విధాలా మేలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం మన జగనన్న ప్రభుత్వమన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని దాదాపు 98 శాతం హామీలు నెరవేర్చిన ఘనత వైఎస్సార్ సీపీ సర్కారుకే దక్కుతుందన్నారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తుండడంతో ప్రతిఇంటా సంక్షేమ వెలుగులు వెల్లివిరుస్తున్నాయన్నారు. ప్రస్తుతం అమలులోని పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు కూడా పెరిగాయన్నారు. ప్రతీ పేదవాడు జగనన్న హయాంలో కడుపునిండా భోజనం చేస్తూ సొంతింట్లో చాలా సంతోషంగా ఉంటున్నాడన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు సిరిపురపు జగన్‌మోహన్‌రావు, సర్పంచ్ వి.సాయిలత, ఎంపీటీసీ వి.వెంకటేశ్వరనాయుడు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ జి.స్వామినాయుడు, తాలాడ ఎంపీటీసీ కె.సన్యాసినాయుడు, జేసీఎస్ కన్వీనర్ ఆర్.రమేష్‌నాయుడు, సర్పంచ్‌లు డి.తిరుపతి, వి.రమణ, డి.దాలినాయుడు, జి.సురేష్, పి.ఈశ్వరరావు, బి.జ్యోతీశ్వరరావు, ఆర్. స్వామినాయుడు, ఎంపీడీఓ ఎస్.రఘునాధాచారి, డిప్యూటీ తహసీల్దార్ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబువి అన్నీ అబద్ధపు హామీలే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు

- ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు

రామభద్రపురం: ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడివి అన్నీ అబద్ధపు హామీలేనని, గతంలో ఆయన ఇచ్చిన ఎన్నో హామీలను విస్మరించి ఆ మాట నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే శంబంగి చిన వెంకట అప్పలనాయుడు ఎద్దేవా చేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయానికి మంగళవారం విచ్చేసిన ఆయన ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావుతో కలిసి కాసేపు విలేకరులతో మాట్లాడారు. ఇటీవల జరిగిన టీడీపీ మహానాడులో ఆ పార్టీ మినీ మేనిఫెస్టో విడుదల చేసిందని, అందులోని హామీలన్నీ మన రాష్ట్రంలో అమలవుతున్న కొన్నింటిని, మన పొరుగు రాష్ట్రం కర్ణాటకలో అక్కడి పార్టీలు ప్రకటించిన మరి కొన్నింటిని కాపీ కొట్టినేవనని ఆరోపించారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు అధికారంలోకి వచ్చేందుకు దాదాపు 600కు పైగా హామీలు ఇచ్చారని, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిలో 10 శాతం కూడా నెరవేర్చలేదని విమర్శించారు. ప్రస్తుతం అధికారంలోని మన జగనన్న ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలోని దాదాపు 98 శాతం హామీలు నెరవేర్చి, ప్రజావిశ్వాసం కూడగట్టుకుందన్నారు. ఉచిత పథకాలతో రాష్ట్రం మరో సోమాలియా, శ్రీలంక, ఉక్రెయిన్ అయిపోతుందన్న చంద్రబాబే మళ్లీ ఉచిత హామీల బాట పట్టడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. పూటకో మాట మాట్లాడే ఆయనను ప్రజలు నమ్మడం లేదన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలకు మేలు చేస్తున్న జగనన్న వెంటే జనమంతా ఉన్నారని, వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీదే మళ్లీ అధికారమని జోష్యం చెప్పారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, రామభద్రపురం పాల సొసైటీ అధ్యక్షుడు చొక్కాపు రామకృష్ణ, నాయకులు పువ్వల మురళీకృష్ణ, పెద్దింటి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వివాదాలకు పాల్పడితే క్రిమినల్ చర్యలు



బాధితుడి నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ ఉపేంద్ర

వంగర: గ్రామాల్లో ప్రజలు వివాదాలు, బెదిరింపు చర్యలకు పాల్పడితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని రాజాం రూరల్ సీఐ ఉపేంద్ర హెచ్చరించారు. మండలంలోని బాగెంపేట గ్రామంలో రెడ్డి వల్లభనాయుడు తన ఇంటి స్థలాన్ని కొంతమంది ఆక్రమించుకున్నారని జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా 1902 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మంగళవారం మంగళవారం ఆ గ్రామానికి వెళ్లిన సీఐ బాధితుడి నుంచి వివరాలు సేకరించారు. ఆక్రమణకు గురైన తన స్థలాన్ని ఇప్పించాలని బాధితుడు విజ్ఞప్తి చేయగా, ఇరువర్గాలతో సీఐ కాసేపు మాట్లాడి, వివాదం సద్దుమణిగించేందుకు ప్రయత్నించారు. స్థల సమస్యలు ఉంటే కోర్టును ఆశ్రయించాలే తప్ప, వివాదాలు, బెదిరింపులకు పాల్పడకూడదన్నారు. దీనిపై తాను సేకరించిన వివరాలతో కూడిన నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. ఆయన వెంట కానిస్టేబుల్ నరసింగరావు ఉన్నారు.

అదనపు పరిహారం చెల్లించండి



ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

మెంటాడ: మండల కేంద్రంలో హరిత జాతీయ రహదారిని ఆనుకుని, నిర్మిస్తున్న రింగు రోడ్డు కోసం భూములు ఇచ్చిన రైతులకు అదనపు పరిహారం చెల్లించాలని వారు కోరుతున్నారు. ఇదే విషయమై బాధిత రైతులు అక్కడి జాతీయ రహదారిపై మంగళవారం నిరసన చేపట్టారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరతో పాటు అదనంగా 30 శాతం పరిహారం ఇస్తామని ఆర్డీఓ, జిల్లా స్థాయి అధికారులు కొంతమంది గతంలో హామీ ఇచ్చారని అయితే అవేమీ చెల్లించకుండా రింగురోడ్డు నిర్మాణానికి సిద్ధం కావడం సమంజసం కాదన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు గంట్రేటి అప్పలనాయుడు, మండల కుమార్, సిద్ధాబత్తుల శ్రీను, పతివాడ త్రినాధరావు పాల్గొన్నారు.

వెదురు మొక్కల పంపిణీకి చర్యలు

- ఉద్యాన శాఖ ఏడీ కె.శైలజ



మాట్లాడుతున్న ఉద్యాన శాఖ ఏడీ శైలజ

బొబ్బిలి: వెదురు మిషన్ పథకంలో భాగంగా రైతులకు వెదురు మొక్కలు పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతున్నామని ఉద్యాన శాఖ ఏడీ కె.శైలజ తెలిపారు. స్థానిక ఉద్యాన శాఖ కార్యాలయంలో సిబ్బందికి వెదురు మిషన్ పథకంపై అవగాహన కల్పించి, కాసేపు విలేకరులతో మాట్లాడారు. వెదురు మొక్కల పెంపకానికి రైతులను ప్రోత్సహిస్తామన్నారు. ఒక్కో వెదురు మొక్క ధర రూ.240 ఉండగా, కేవలం రూ.50కే అందజేస్తామన్నారు. ఒక్కో మొక్క పెంపకానికి మొదటి రెండేళ్లు రూ.60, తర్వాతి ఆరేళ్లు రూ.40 రైతులకు ఇస్తామన్నారు. అలాగే సపోటా తోటల పెంపకానికి హెక్టారుకు మొదటి ఏడాది రూ.10,286, తర్వాతి రెండేళ్లు రూ.3,200 చొప్పున ప్రోత్సాహకంగా చెల్లిస్తామనినారు. హైబ్రిడ్ వెజిటబుల్ కల్టివేషన్ కింద 40 శాతం రాయితీని సీజన్‌కు అందిస్తామన్నారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 45,750 హెక్టార్లలో ఉద్యాన పంటల సాగు జరుగుతోందన్నారు. కార్యక్రమంలో బొబ్బిలి, రామభద్రపురం హెచ్ఓలు వెంకటరత్నం, మోహన్‌కృష్ణ, ఆర్‌బీకే ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీ



రైతులకు ఎరువులు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణారావు

బొబ్బిలి: మండలంలోని గొల్లపల్లి గ్రామ రైతు భరోసా కేంద్రంలో రైతులకు మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు చేతులమీదుగా మంగళవారం ఎరువులు పంపిణీ చేశారు. రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, సబ్సిడీపై ప్రభుత్వం ఇస్తున్న విత్తనాలు, ఎరువులు, సాగు యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు తెర్లి సత్యనారాయణ, పార్టీ నాయకులు తుట్ట తిరుపతి, దమ్మా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ యంత్రసేవా పథకం రైతులకు వరం



వైఎస్సార్ యంత్రసేవా పథకం ద్వారా పొందిన ట్రాక్టరుతో చేస్తున్న దుక్కి పనులను పరిశీలిస్తున్న అధికారులు

- వ్యవసాయ శాఖ ఏడీఏ కె.చంద్రరావు

రాజాం: వైఎస్సార్ యంత్రసేవా పథకం రైతులకు వరం లాంటిదని వ్యవసాయ శాఖ ఏడీఏ కె.చంద్రరావు అన్నారు. మంగళవారం మండలంలోని ఒమ్మి గ్రామంలో యంత్రసేవా పథకం ద్వారా ట్రాక్టరు పొందిన రైతు దాసరి సన్యాసినాయుడు పొలంలో యంత్రం ద్వారా చేస్తున్న దుక్కి పనులను ఆయన పరిశీలించారు. ప్రభుత్వం ఈ పథకం ద్వారా రైతులకు అవసరమైన యంత్రాలు ఇచ్చి, ఎంతో మేలు చేకూర్చుతోందన్నారు. రాజాం మండలంలోని 14 రైతు సంఘాలకు వీటిని అందించామని పేర్కొన్నారు. రైతులు ఈ పథకంతో మంచి ఫలసాయం పొందడంతో పాటు కూలీల కొరతను కూడా నివారించవచ్చన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారిణి ఎ.రేణుకాసాయి తదితరులు ఉన్నారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు



పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు



రేగిడి: వన్నలి గ్రామంలో కాలువలోని పూడికలు తొలగిస్తున్న కూలీలు

రాజాం సిటీ: స్థానిక సారధి రోడ్డులో పారిశుద్ధ్య పనులు చురుగ్గా నిర్వహిస్తున్నారు. మంగళవారం ఈ పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలు, జంగిల్స్‌ను జేసీబీ సహాయంతో తొలగించారు. మెయిన్ కాలువలో పేరుకుపోయిన పూడికలు తొలగించేందుకు అంచనాలు రూపొందించాలని మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు సిబ్బందిని ఆదేశించారు. ప్రజలకు కూడా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలని తెలిపారు.

రేగిడి: మండలంలోని వన్నలి గ్రామంలో మంగళవారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. ప్రధాన వీధులు, మురుగుకాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించి, వాటిని చెత్త సంపద కేంద్రాలకు తరలించారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా పంచాయతీ పరిశుభ్రతకు సహకరించాలని సర్పంచ్ గార రమణ, పంచాయతీ కార్యదర్శి గోవిందరావు గ్రామస్తులను కోరారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



చిన్నారులకు ఆరోగ్య తనిఖీలు చేస్తున్న తెర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారి రవికుమార్

తెర్లాం: చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని తెర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డి రవికుమార్ సూచించారు. మండలంలోని నందిగాం–1, 2 అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రీస్కూల్ పిల్లలకు మంగళవారం ఆరోగ్య తనిఖీలు చేపట్టిన ఆయన అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి ఎండలు ఎక్కువగా ఉన్నందున పిల్లలు వడదెబ్బకు గురికాకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పిల్లలను ఎండలో ఆడనివ్వవద్దని, వీలైనంత వరకు ఇంటి దగ్గరే ఉండేలా చూడాలన్నారు. చల్లగా ఉన్న సమయాల్లో మాత్రమే వారిని ఆడుకునేందుకు అవకాశం ఇవ్వాలని, ప్రతిరోజూ వారికి పౌష్టికాహారం పెట్టాలని తెలిపారు. ప్రతినెలా పిల్లలకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించాలన్నారు.

నవదుర్గ ఆలయ ఆదాయం రూ.1.43 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలోని నవదుర్గ అమ్మవారి ఆలయ హుండీ ఆదాయం మంగళవారం లెక్కించారు. భక్తుల కానుకల రూపంలో మొత్తం 69 రోజులకు గాను లభించినది రూ.1,43,615 అని ఆలయ ఈఓ పి.శ్యామలరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు మాధవరావు, ఆలయ ధర్మకర్త నర్సింగరావు, భక్తులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న విశ్రాంత ఎంఈఓ సత్యనారాయణ

తెర్లాం: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని విశ్రాంత మండల విద్యాశాఖాధికారి ఎం.సత్యనారాయణ కోరారు. మంగళవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పుస్తక పఠనం, గణితంలోని మెలకువలపై విద్యార్థులకు అవగాహన కల్పించిన ఆయన అన్ని సబ్జెక్టుల్లో కన్నా గణితం చాలా సులభమైన సబ్జెక్ట్ అని, ఇష్టంతో నేర్చుకునే ఏ సబ్జెక్ట్ అయినా సులువుగా అర్థమవుతుందన్నారు. తొలుత గణితంపై ఉన్న భయాన్ని ప్రతీ విద్యార్థి విడనాడాలన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవడం మంచిదన్నారు.

మంచినీటి కోనేరు అభివృద్ధికి చర్యలు



కోనేరు గట్టును చదును చేయిస్తున్న సర్పంచ్

తెర్లాం: మండలంలోని పాములవలస గ్రామంలో మంచినీటి కోనేరు అభివృద్ధికి చర్యలు చేపడుతున్నారు. సర్పంచ్ చప్ప రాధ ఈశ్వరరావుతో పాటు గ్రామానికి చెందిన యువత సహాయ, సహకారాలతో కోనేరు అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు సర్పంచ్ తెలిపారు. ప్రస్తుతం కోనేరు గట్టు అభివృద్ధి, చెరువులో పూడికతీత వంటి పనులు చేయిస్తున్నామని, పనులు పూర్తయిన వెంటనే కోనేరు గట్టుపై మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటామని సర్పంచ్ తెలిపారు.

8న వాహనాల వేలం

మెంటాడ: గజపతినగరం పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 8వ తేదీన వాహనాల వేలంపాట నిర్వహించనున్నట్లు ఆంధ్ర ఎస్ఐ సిద్ధార్థ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పలు ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు సంబంధించి, జరిగే ఈ వేలంపాటలో ఆసక్తి ఉన్న వారు పాల్గొని, వాహనాలను సొంతం చేసుకోవాలని కోరారు.

హెల్మెట్ తప్పనిసరి



హెల్మెట్లపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేస్తున్న పోలీసులు

రేగిడి: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని ఎస్ఐ ఇ.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద హెల్మెట్ల వినియోగంపై అవగాహన కల్పిస్తూ మంగళవారం ర్యాలీ నిర్వహించారు. వాహనాలతో రోడ్లపైకి వచ్చేటప్పుడు హెల్మెట్లు పెట్టుకోవాలని, ఇలా చేస్తే ఒకవేళ ప్రమాదానికి గురైనా అంతగా ప్రమాదం జరగదని తెలిపారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, ప్రమాదాల నివారణకు సహకరించాలన్నారు. మైనర్లకు వాహనం ఇవ్వవద్దని, మద్యంతాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దని తెలిపారు.

కొలతల ప్రకారం పనిచేస్తే గిట్టుబాటు వేతనం



రాజాం: శ్యాంపురంలో జరిగిన పనులకు కొలతలు వేస్తున్న ఎంపీడీఓ శంకరరావు



రేగిడిలో జరుగుతున్న ఉపాధి పనుల్లో వేతనదారులు

రాజాం: నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.270 గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందని ఎంపీడీఓ బాసూరి శంకరరావు తెలిపారు. మండలంలోని శ్యాంపురం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం పరిశీలించిన ఆయన రోజుకు రెండు పూటలా పనిచేయాలని, వేసవి నేపథ్యంలో వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్త వహించాలన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ సాయిరాం, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్‌లు పాల్గొన్నారు.

రేగిడి: ఎండల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో వేతనదారులు వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఏపీఓ హరనాధరావు మంగళవారం తెలిపారు. పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ఆర్‌బీకే సేవలపై అవగాహన కల్పించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ శిరీష

బాడంగి: రైతు భరోసా కేంద్రాలు(ఆర్‌బీకే) సేవలపై రైతులకు అవగాహన కల్పించాలని మండల వ్యవసాయాధికారి కె.శిరీష సూచించారు. మండలంలోని గూడెపువలస గ్రామంలో ఖరీఫ్ సాగుకు ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహకాలు, సదుపాయాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ప్రభుత్వం రాయితీపై ఇస్తున్న ఎరువులు, విత్తనాలు, యంత్ర పరికరాలు, సాగు యంత్రాలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. నేల రకం తగ్గట్టు పంటలు వేసుకుంటే అధిక దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గణేశ్వరరాజు, వీఏఏ సతీష్ తదితరులు పాల్గొన్నారు.